# అసలు కంటే వడ్డీ ముద్దు

- భమిడిపాటి సోమయాజి

వీధి అరుగుమీద కూర్చుని పేపరు చదువుకుంటున్న ఆనందరావు దగ్గరికి ఏడుపుతో పరుగెత్తుకుంటూ వచ్చిన మనవడు మనోహర్ "అమ్మ కొట్టింది" అన్నాడు.

అది విన్న కోడలు "కొంచెం వస్తే చాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మీ తాత దగ్గరికి పరుగెడతావ్. ఆయనేం చేస్తాడు? ఆయనేం చేయలేకే మన దగ్గరుంటున్నారు" అంటూ మనోహర్‌ని లోపలకు తీసుకుపోయింది.

"ఏమిటో అర్థంకాని జీవిత గమనం. వాళ్ల అమ్మ కొట్టకా మానదు, వాడు ఏడుస్తూ నా దగ్గరికి రావడం మానడు. పాపం వాడికేం తెలుసు నా జవసత్వాలుడిగి ఏ ఆధారం లేక వున్న ఒక్క కొడుకు పంచన నేను చేరానని" అని లోపల మధనపడుతున్న సమయంలో మిత్రుడు మాధవ్ వచ్చాడు.

"ఏం! తాతగారెలా ఉన్నారు?" అన్నాడు.

"ఏమిటో నాకు మనవడు పుట్టినప్పటినుంచీ నన్ను తాతా తాతా అంటూ తగులుకున్నావు. అవును అన్నట్లు నువ్వు ఇంగ్లీష్ మీడియం స్టూడెంట్వికదా. నీకేం తెలుస్తుంది? తాత అంటే అధికుడు, మించినవాడు, బ్రహ్మదేవుడు అని అర్థాలున్నాయి. నేను దేంట్లోనూ అధికుడ్నికాను, ఎవ్వర్నీ మించినవాడనూకాను. బ్రహ్మదేవుడ్ని అసలే కాను. బ్రహ్మ సృష్టిలోని ఒక బడుగు నిర్భాగ్యపు జీవిని" అన్నాడు ఆనందరావు.

"ఏమిట్రోయ్ ఈరోజు తెలుగు పాఠాలు చెబుతున్నావు. ఇదేం తెగులు నీకు? షష్టిపూర్తి పూర్తయినా నేను తాత కాలేకపోయాను. ఆ అదృష్టం నీకు పట్టిందని తాతా అంటున్నాను. తప్పయితే ఇక అనునులేరా తాతా"

"పనిలో పని ఇంకొక పాఠం చెబుతాను విను. తెలుగులో అనుభవైక వేద్యము అనే పదముంది. దాని అర్థమేమిటంటే ఏవైనా స్వయంగా అనుభవిస్తేగానీ తెలియదు అని. ఉదాహరణకు నేను మైసూర్‌పాక్ తింటూ 'చాలా బాగుంది' అంటే అది రుచిగా ఉందో, ఎంత గుల్లగా ఉండి నోట్లో వేసుకుంటే కరిగిపోతుందో, నువ్వు తింటేగానీ నీకు తెలీదు. అయినా నీకు స్వీట్లు ఇష్టమని మైసూర్ పాక్ ఉదాహరణగా చెప్పాను. నా జీవితంలో తీపి లేదు. చేదే మేస్తున్నాను. ఇప్పుడే బుట్టెడు వేపాకు చేదు తిన్నాను. నీకు ఫేస్ రీడింగ్ తెలియక వస్తూనే తాతా అంటూ తగులుకుని నన్ను పారితోషికం లేని ఉపాధ్యాయుడ్నిచేసి దెబ్బతిన్నావు" అంటూ తన కోడలి 'సొగసుగా మృదంగతాళం' గురించి చెప్పాడు ఆనందరావు.

"అలా చెప్పు. ఆ మృదంగ తాళానికా నాకీ మద్దెలదరువు. నేను చాలాసార్లు చెప్పాను. ఏం ఆలోచించకుండా ఒక మహాయోగిలా కాలం గడపమని. నీకు చిన్నప్పటి నుంచీ అన్ని విషయాలూ ఆలోచించడం అలవాటు. కొన్నింటికి ఎంత ఆలోచించినా పరిష్కారాలుండవు. మనస్సులోని ఆలోచనలను పక్కనపెట్టేయ్ ఇకనైనా"

"ఏమిట్రా! ఇదేమైనా నా జేబులో ఉన్న వస్తువా పక్కన పెట్టేసి నిశ్చింతగా ఉండడానికి" అన్నాడు ఆనందరావు.

"నీ ఇష్టం! నేను చెప్పేది చెప్పాను. అయినా ఈరోజు నా టైమ్ బాగాలేదు. ఇంగ్లీషు మీడియం అంటూ చీవాట్లు పెట్టావు. రేపొచ్చి కలుస్తాలే" అని నిష్క్రమించాడు మాధవ్.

★★★

రాత్రి పదకొండుగంటలవుతోంది. ఆనందరావుకి నిద్ర పట్టలేదు. మనవడు తనని అమ్మ కొట్టిందని వస్తే 'మీ అమ్మ పని నేను చెబుతాలే' అని సాధారణంగా తాతలుగానీ మామ్మలుగానీ మనవడ్ని సముదాయిస్తూ అనే మాటలు కూడా తను అనలేకపోయాడు. కొడుకు ఇంట్లో తన ఉనికి అటువంటిది. అతనికి ఒక్కడే కొడుకు. ఆడపిల్లలు కూడా లేరు. ఈ ముసలితనంలో ఇంకెక్కడికి పోగలడు? 'మీ అమ్మ పని చెబుతాలే' అని మాటవరసకి తమాషానైనా అంటే ఇంకేమైనా ఉందా? ముందు తన పనైపోతుంది. కోడలు మనవడ్ని కొట్టిన విషయం గురించే ఆలోచిస్తూ పడుకున్నాడు. మంచంమీద వాలితే పడుకున్నట్లేగానీ నిద్ర పోయినట్లు కాదుగా!

ఇంతలో మెల్లగా కోడలు కాబోలు తన కొడుకుతో అంటోంది.

"అదికాదండీ. వీడు అస్తమానం తాతా తాతా అంటూ మీ నాన్న దగ్గరే వుంటున్నాడు. ఆయన కనబడకపోతే మనోహర్ దిగులు పెట్టుకుంటాడేమోనని నాకు భయంగా ఉంది"

"అయినా మా నాన్న కనబడకుండా ఎందుకు పోతారు? మా నాన్న విషయంలో నువ్వేమీ దిగులు పడకు. ఆయనకు భగవంతుడు ఐశ్వర్యం ఇవ్వలేదుగానీ ఆయుష్షు ఇచ్చాడు. మా ఊళ్లో ఉన్న సిద్ధాంతిగారు రాసిన జాతకం ప్రకారం ఆయన ఆయుష్షు తొంభై ఏళ్ళు. ఇక నిద్రపో. మనస్సు ప్రశాంతంగా ఉంచుకో. లేకపోతే నీ ఆరోగ్యం దెబ్బ తింటుంది"

"పోన్లెండి. కొంతవరకూ నేను అదృష్టవంతురాలినే. మిథునం మిథునంలా చెక్కు చెదరకుండా ఉంటే నేను చచ్చేదాన్నే" అంది ఉభయ భాషా ప్రవీణ.

"మిథునం అంటే?"

"దంపతులు. అదే మీ నాన్న అమ్మామూ. ఆవిడ పైలోకాలకు వెళ్లిపోయింది. లేకపోతే ఆవిడకి కూడా ఏ తొంభై ఏళ్ళు ఆయుష్షు అనుకోండి రెండు తొంభైలు నూట ఎనభై" అంది గణితవేత్త.

"నా తొంభై కూడా కలిపితే రెండువందల డెబ్బై. వెధవ లెక్కలూ నువ్వూను. నన్ను చికాకు పెట్టకు. ఇకచాలు నీ అతి తెలివి ప్రదర్శన. పడుకో" అన్నాడు కొడుకు.

బహుశా నేను నిద్ర పోతున్నాననుకుని కాబోలు కోడలు గట్టిగా మాట్లాడింది. 'ఈవిడ చదువుకుందిగానీ చదువుకున్నవారికి ఉండవలసిన జ్ఞానంలేదు' అనుకున్నాడు ఆనందరావు.

★★★

మాధవ్‌కి తన మనసులోని వేదన గురించి వివరించి "కోడలు మాట్లాడే మాటలు వినలేకపోతున్నాననీ, సంపాదించినదాంట్లో డబ్బు వెనకేసుకుపోవడంవలన తన కోడలు మాట్లాడే మాటలు విని బాధపడవలసి వచ్చిందని" వాపోయాడు ఆనందరావు.

"నిన్న తెలుగు పాఠాలు చెప్పావు నువ్వు. ఈరోజు నేను ఇంగ్లీషు పాఠాలు చెప్పి నీ రుణం తీర్చుకుంటాను విను. నువ్వు డబ్బు దాచుకోకపోవడం తప్పే. అందుకే ఇంగ్లీషు సామెత 'ఫ్రెండ్‌షిప్ ఈజ్ లైక్ మనీ ఈజియర్ మేడ్ దేన్ కెప్ట్' అని చెబుతారు. అవునూ అన్నట్లు తెలుగు మీడియం కదూ!

'స్నేహం, డబ్బు సంపాదించడం సులువే. కానీ నిలబెట్టుకోవడం కష్టం' అని అర్థం" అన్నాడు మాధవ్.

"పోన్లేరా... సంపాదించిన డబ్బు నిలబెట్టుకోలేకపోయినా నీ స్నేహం నిలబెట్టుకున్నాను కదరా"

"ఆ...అది నా మంచితనంవల్లనేరా. నువ్వు రోజూ ఇంగ్లీషు మీడియం అని తిడుతున్నా ఏదో పోనీలే మనవాడే కదా అని వదిలేస్తున్నాను నిన్ను"

"సర్లే..వెధవ కబుర్లాపి నాకేదైనా ఉద్యోగం ఇప్పించరా. కొంత సంపాదిస్తేనైనా మాకోడలి దృష్టిలో నా విలువ కొంచెమైనా పెరుగుతుందేమో!"

"నీకిప్పుడు అరవైమూడేళ్ళు. ఏం ఉద్యోగం చేయగలవురా?"

"ఉద్యోగం ఎలాగైనా చేస్తాను. నా అయుష్షు తొంభై ఏళ్ళు తెలుసా? ఇంకా ఇరవై మూడేళ్ళు ఇలాగే ఏం చేయకుండా ఊరికే తింటూ బ్రతకమంటావా? ఓ పదేళ్లయినా ఉద్యోగం చేస్తాన్రా!"

"ఇంకో ఊళ్లోనైనా చేస్తావా? మరి నీ మనస్సుని హరించినవాడ్ని విడిచి ఉండగలవా?"

"వాడెవడు?"

"అదేరా నీ మనవడి పేరు మనోహర్ కదురా!"

"ఓ...వాడు నా మనస్సు హరించాడుగానీ నా దేహం నుంచి నా మనస్సుని విడదీయలేదు. నా మనస్సులోంచి నా మనవడ్ని ఎవ్వరూ విడదీయలేరు. నేనే ఊరెళ్లినా నాతోపాటే నా మనస్సు, నా మనస్సుతోపాటే నా మనవడు. వాడిమీద నా ప్రేమ హద్దుల్లేకుండా పెరగడమే కావాలిరా. ఇంకో ఊళ్ళో ఉద్యోగం వలన సంపాదన, ప్రేమ పెరుగుతుంది. 'టూ బర్డ్స్ ఎట్ వన్ షాట్'. ఎలా వుంది నా ఇంగ్లీషు. అయినా ఇన్నేళ్లు నీతో స్నేహం చేసి ఈమాత్రం ఇంగ్లీషు మాట్లాడకలేకపోతే ఎలారా మాధవా"

"ఇన్నాళ్లూ నువ్వు ఉభయ భాషా ప్రవీణవేరా! ఇప్పుడిక త్రిభాషావేత్తవు అయిపోతావు"

"మా ఇంట్లో ఉభయ భాషాప్రవీణులు ఉన్నారురా. అంటే నాకోడలు నేనూ కూడా ఉభయ భాషా ప్రవీణులమే. నేను బిఎ కూడా పాస్ అయ్యాను.తెలుగు మీడియంలే. అసలు మా కోడలు భాషణ నువ్వెప్పుడూ వినలేదు"

"అయితే ఆవిడ మాటలు వింటూ నీ కొడుకు దగ్గరే ఏడవకూడదు"

"వద్దులే. ఇప్పటికి నేవిన్న మాటలు చాలు. నా విన్నపం విన్నావుకదా. ఏదైనా ఉద్యోగం ఇప్పించు"

"మంచిది. నేను ప్రయత్నం చేస్తా"

★★★

కొన్నాళ్ల తరువాత తనకి తెలుసున్న వాళ్లని అడిగి వైజాగ్‌లో ఓ స్కూలు ఇన్‌చార్జిగా ఉద్యోగం వేయించాడు ఆనందరావుకి.

ఆనందరావు వెళ్లిన ఆర్నెల్లకి మాధవ్ కూడా వైజాగ్‌కి మకాం మార్చాడు. మళ్లీ అక్కడ మొదలయ్యాయి మిత్రుల చతురులు, పరస్పర పాఠాలు!

